క్లుప్తంగా

సాయిచంద్‌కు నివాళి



హుజూరాబాద్: రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్, తెలంగాణ ఉద్యమ గాయకుడు సాయిచంద్ ఇటీవల మృతి చెందారు. పట్టణంలోని బీఆర్ ఎస్ కార్యాలయ ఆవరణలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సంగెం ఐలయ్య, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

లెదర్ ఇండస్ట్రీ ఏర్పాటు చేయాలి



సమావేశమైన చర్మకారులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులో కేటాయించిన భూముల్లో లెదర్ ఇండస్ట్రీని ఏర్పాటు చేయాలని శిక్షణ చర్మకారులు డిమాండ్ చేశారు. సోమవారం లెదర్ పార్కు భూముల్లో సమావేశమై మాట్లాడారు. చర్మకారులను నిర్లక్ష్యం చేయడం తగదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోతూరి రమేశ్, గజ్జల లచ్చయ్య, మల్లేశం, లింగయ్య, సునీత, కోమల, మేరీ, లక్ష్మి, శ్యామలత, భారతి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

గన్నేరువరం: మండలంలోని చొక్కారావుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా సోమవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ పులి శారద మాట్లాడుతూ... పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిందని గర్భిణులు, బాలింతలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మంకాలి సంతోష్, దీపిక, బూర స్రవంతి, రేణుక, జంగపల్లి దీపిక, శారద, నర్సవ్వ పాల్గొన్నారు.

వరద సమస్యలు తలెత్తకుండా చెత్తాచెదారం తొలగింపు



పనులు పరిశీలిస్తున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: వర్షాకాలంలో పట్టణంలో వరద సమస్య తలెత్తకుండా ఐదో వార్డులోని రైల్వే లైన్ అండర్ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం పిచ్చి మొక్కలను ప్రొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు. సోమవారం చెత్త తొలగింపు పనులను మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు పరిశీలించారు. వరద సమస్య తలెత్తకుండా తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, కౌన్సిలర్లు పిట్టల శ్వేత, శ్రీపతి నరేష్, గాజుల భాస్కర్ ఎలగందుల శ్రీహరి మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గీకురు రవీందర్

చిగురుమామిడి: నిత్యజీవితంలో భాగమైన ప్లాస్టిక్‌ను నిషేధించాలని జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని ఇందుర్తి జెడ్పీపాఠశాలలో ప్లాస్టిక్ బ్యాగుల నివారణ దినోత్సవం సందర్భంగా మానవ మనుగడ సాగాలంటే పర్యావరణం, ప్రకృతిని కాపాడుకోవాలని, ప్లాస్టిక్ భూమిలో కరిగిపోవడానికి వందల ఏళ్లు పడుతుందని, భూసారం నాశనం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్ ఉస్మాన్‌పాషా, హెచ్ఎం లక్ష్మణ్‌రావు, టీచర్లు ప్రతాపరెడ్డి, పవన్‌కుమార్, రామలింగాచారి, సంగీతకుమారి, సవిత, రమాదేవి, ముకుందరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లుగా సతమతం

- నలభై ఏళ్ల క్రితం గుండి నుంచి గోపాల్‌రావుపేట జీపీ ఏర్పాటు
- సరిహద్దులు నిర్ణయించక భారీగా నష్టపోతున్న 'గుండి'
- కలెక్టర్‌కు విన్నవించిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

రామడుగు: నలభై ఏళ్ల క్రితం ఆ రెండు గ్రామాలు కలిసి 'గుండి 'గ్రామ పంచాయతీగా కొనసాగాయి. 1981లో గుండి గ్రామం నుంచి గోపాల్‌రావుపేట గ్రామాన్ని ప్రభుత్వం వేరు చేసింది. గోపాల్‌రావుపేట జీపీగా ఏర్పాటు చేసినా రెవెన్యూ పరంగా రెండు గ్రామాలకు హద్దులు నిర్ణయించకపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రెవెన్యూ గుండి గ్రామం.. పర్మిషన్లు గోపాల్‌రావుపేటవి

మండలంలోని గుండి గ్రామ రెవెన్యూ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల గోపాల్‌రావుపేట గ్రామ పంచాయతీ అనుమతులు ఇవ్వడంతో ఇరు గ్రామాల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. తమ గ్రామ రెవెన్యూ పరిధిలో తమ అనుమతితోనే ఇళ్లు కట్టుకోవాలని గుండి గ్రామ పంచాయతీ ఇళ్లు నిర్మించుకునే యజమానులకు సూచిస్తోంది.

కలిసిపోతున్న రెండు గ్రామాలు...

గుండి, గోపాల్‌రావుపేట గ్రామాల మధ్య గతంలో కిలోమీటర్ దూరం మాత్రమే ఉండేది. కాగా ఇటీవల గుండితో పాటు గోపాల్‌రావుపేట నుంచి ప్రధాన రహదారి వెంట పలు వ్యాపారాలు చేసుకోవడానికి భవనాలు నిర్మిస్తుండడంతో రెండు గ్రామాల సరిహద్దులు కలిసిపోయాయి. దీంతో రెండు గ్రామాల మధ్య సరిహద్దు సమస్య తీవ్రమవుతోంది.



ఆదాయం కోల్పోతున్న గుండి జీపీ

అధికారులు రెండు గ్రామాలకు సరిహద్దులు నిర్ణయించకపోవడంతో గుండి గ్రామ పంచాయతీ భారీగా ఆదాయం కోల్పోతుంది. గుండి, గోపాల్‌రావుపేట గ్రామాల మధ్య రెవెన్యూ హద్దులు నిర్ణయించాలని గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు అధికారులకు మొరపెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. గ్రామ ఉపసర్పంచ్ ఏకంగా ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి గ్రామానికి రెవెన్యూ పరంగా హద్దులను నిర్ణయించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని విన్నవించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

మండల కేంద్రంగా ప్రకటించాలని..

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మండలాలను ఏర్పాటు చేస్తుండడంతో మండలంలోని గోపాల్‌రావుపేటను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తారని ప్రచారం జరగడంతో గుండి గ్రామస్తులు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కలిసి గోపాల్‌రావుపేటను మండల కేంద్రంగా ప్రకటిస్తే గుండిగోపాల్‌రావుపేటను మండలంగా ప్రకటించాలని వినతిపత్రం అందజేశారు.

సరిహద్దులు నిర్ణయించాలి



గోపాల్‌రావుపేటను జీపీగా ప్రకటించిన గెజిట్ కాపీని ఎంపీడీవో, డీపీవో, జిల్లా స్థాయి అధికారులను అడిగినా లేదని సమాధానం చెబుతున్నారు.సరిహద్దులు నిర్ణయించకపోవడంతో గుండి గ్రామం భారీగా నష్టపోతుంది. అధికారులు ఇప్పటికైన రెండు గ్రామాల సరిహద్దులను గుర్తించాలని కోరుతున్నాం.

– మానస, సర్పంచ్, గుండి

సమస్య పరిష్కరించాలి



సరిహద్దులు ఏర్పాటు చేయాలని పలుమార్లు మండల అధికారులకు విన్నవించినప్పటికి సమస్య పరిష్కరించలేదు. దీంతో గుండి గ్రామ పంచాయతీ హద్దులు నిర్ణయించాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించాను. ఇప్పటికైన గ్రామ సమస్య పరిష్కారం జరుగుతుందని ఆశిస్తున్నా.

– మేడి శ్రీనివాస్‌గౌడ్, ఉపసర్పంచ్, గుండి

గెజిట్ ప్రకారం విభజన



ఒక గ్రామ పంచాయతీ నుంచి విభజించి మరో గ్రామ పంచాయతీని ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు గెజిట్ ప్రకారం రెవెన్యూను విభజించి ప్రకటించడం జరుగుతుంది. దాని ప్రకారంగానే అప్పుడు గుండి నుంచి గోపాల్‌రావుపేటను ప్రభుత్వం గ్రామ పంచాయతీగా ప్రకటించి ఉంటుంది.

– రాజ్‌కుమార్, తహసీల్దార్, రామడుగు

ట్రిపుల్ ఐటీకి పదిమంది విద్యార్థుల ఎంపిక

శంకరపట్నం: కేశవపట్నం మోడల్‌స్కూల్ విద్యార్థులు పదిమంది ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రిన్స్‌పాల్ జ్యోతి తెలిపారు. ఎస్సెస్సీ చదివిన గాజుల మనోజ్ఞ, కొయ్యడ హన్సిక, ఎండీ. సభ, మోతె అమూల్య, కాలంగి హేమంత్ సత్యసూర్య, రాదారపు అలేఖ్య, కొయ్యడ అశ్విత, నేదురు సబిత, నల్ల కావ్య, అడితం సాయితేజ ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు.

5, 6న మండల స్థాయి క్రీడా పోటీలు

శంకరపట్నం: క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు 5, 6న మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిరు. 4, 5వ తరగతి విద్యార్థులకు మండలంలోని మెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి జెడ్పీ పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

గన్నేరువరం: జంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డ తెలిపారు.

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి పాఠశాల ఎంపిక పోటీలను సోమవారం మండల విద్యాధికారి కె. వెంకటనర్సింహారెడ్డి ప్రారంభించారు.

బండి సంజయ్‌తోనే పార్టీ బలోపేతం

గన్నేరువరం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌తోనే రాష్ట్రంలో పార్టీ పటిష్టమైందని బీజేపీ నాయకుడు సొల్లు అజయ్‌వర్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తూ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం తీసుకువచ్చారని తెలిపారు. ప్రజా సంగ్రామయాత్రతో పార్టీని ప్రజలకు చేరువ చేశారని అన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల పరిధిలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కాంట్రాక్టర్ , అధికారులు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా పనులు చేసి ప్రజాధనం వృథా చేశారని సామాజిక కార్యకర్త గురుకుంట్ల మధుకర్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా పెద్దమ్మ బోనాలు



చొప్పదండి: పెద్దమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి: మండలంలోని రాగంపేటలో సోమవారం పెద్దమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయానికి తరలివెళ్లి మొక్కులు సమర్పించారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతిరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ముద్దం మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, రహమాన్ పాషా, మామిడి లత, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో శ్రీపెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవ నిర్వహణకు ఎమ్మెల్యే ఈటల రాజేందర్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. సోమవారం ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు ఎదులాపురం నరేందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొగిలి, ఉపసర్పంచ్ రవి కుమార్, కారోబార్ వీరన్న, వార్డు సభ్యులు సృజన్, సుమన్, హైమావతి, సుధాకర్, శ్రీనివాస్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

రామడుగు: మండల కేంద్రానికి సమీపంలోని మోతె వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూ సేకరణ సమస్యతో పనులు ఆలస్యం కావడం జరిగిందని, మిగతా పనులు పూర్తి చేసి ప్రయాణికులకు సౌకర్యంగా అందుబాటులోకి తెస్తామన్నారు. మండలంలోని గుండి గ్రామానికి చెందిన మెహబూబ్ కూతురు అనారోగ్యంతో మృతి చెందగ ఎమ్మెల్యే ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దుర్గం రాజేశం, ఎంపీటీసీ శ్యాంసుందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గుండి ప్రవీణ్ పలువురు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గద్దెదించాలి

మానకొండూర్: ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్ఎస్‌ను గద్దెదించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో గడపగడపకూ కవ్వంపల్లి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, నాయకులు రామిడి తిరుపతి, రామిడి తిరుమల్, పప్పు ఓదెలు, బందెల మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

శంకరపట్నం: మండలంలోని అంబాల్‌పూర్ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నందిరెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వెంట జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ తిరుపతయ్య, మండల అధ్యక్షుడు మహిపాల్, మాజీ సర్పంచ్ రహీం, ముంజ వెంకటేశం ఉన్నారు.

పనుల అడ్డగింత

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి పరిధిలోని సర్వేనంబర్ 407లో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూమి ఎకరం 31గుంటలను కొందరు అక్రమించుకొని చదును చేస్తుండగా ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మాడుగుల రత్నాకర్‌రెడ్డి అడ్డుకున్నారు. ప్రభుత్వస్థలంలో ఎలాంటి పనులు చేయవద్దని పంపించివేశారు. వార్డు సభ్యులు గాండ్ల తిరుపతి, దొబ్బల ఎల్లేశ్ కుమార్, పొన్నం కనకయ్య, అవుదరి అంజయ్య, వేముల కనకయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష



నిరాహార దీక్షలో నిర్వాసితులు

గంగాధర: కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్మాణం కోసం మండలంలోని తాడిజర్రి, రంగరావుపల్లి, కొండన్నపల్లి గ్రామాల రైతుల భూములు సేకరించారు. భూసేకరణ పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం పరిహారం మంజూరు చేయక పోవడంతో మండలంలోని రంగరావుపల్లి గ్రామ నిర్వాసితులు ఆందోళనకు దిగారు. కొద్దిరోజుల క్రితం కొండన్నపల్లి గ్రామ నిర్వాసితులకు పరిహారం మంజూరు చేశారు. రంగరావుపల్లి నిర్వాసితులు పరిహారం కోసం అధికారులు, ఆఫీసుల చుట్టూ తిరిగి విసిగిపోయారు. గతనెల 19 నుంచి గ్రామంలో రిలే నిరాహారదీక్ష చేస్తున్నారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకు నిరాహార దీక్ష విరమించమని, అవసరమైతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు.

మార్కింగ్ ప్రకారమే పనులు చేపట్టాలి



వినతిపత్రం అందిస్తున్న గృహ యజమానులు

చొప్పదండి: పట్టణంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనుల్లో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఇచ్చిన మార్కింగ్ ప్రకారమే రోడ్డు పనులు చేయాలని, సెంట్రల్ లైటింగ్ పనులు రోడ్డుకు ఇరువైపులా గతంలో నిర్ణయించిన యాభై అడుగుల మేరకే చేపట్టాలని అంబేడ్కర్ చౌరస్తాలోని గృహ నిర్మాణదారులు సోమవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందించారు. రోడ్డు సెంటర్‌ను అధికారులు ఇప్పటికే గుర్తించారని, అదే ప్రకారం పనులు చేపట్టాలని కోరారు. కొందరు ప్రజా ప్రతినిధులు రోడ్డు నిర్మాణ పనుల్లో మార్పులు చేసేందుకు, పనులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, రెండు దశాబ్దాలుగా రోడ్డు మధ భాగం మారలేదని, కొత్త వాదనలతో రోడ్డు పనుల్లో జోక్యం చేసుకుంటున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో అంజనేయులు, తిరుపతి, మల్లేశం, రమేశ్, ప్రేమ్‌కుమార్, కిషన్, రమాదేవి, శ్రీకాంత్ రెడ్డి, కనుకయ్య, రాజేశం, సతీశ్, మహేశ్, సత్యం, రాజేశ్వర్ రెడ్డి, బాపురెడ్డి ఉన్నారు.

విద్యుత్ లైన్ పనులు ప్రారంభం



మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం విద్యుత్ లైన్ పనులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్, విద్యుత్ శాఖ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు. మండలంలోని సదాశివపల్లి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కమటం సంపత్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశంలో జీవీఆర్ మాట్లాడారు. పార్టీలో పనిచేసే వారికి తప్పకుండా పదవులు వస్తాయని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కేబుల్ బ్రిడ్జితో గ్రామంలో భూముల విలువ పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆకుల పద్మా ప్రకాష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రామడుగు: మండలంలోని రుద్రారం, రంగసాయిపల్లి గ్రామాల్లో సోమవారం బీజేపీ బూత్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. సమావేశాలకు చొప్పదండి నియోజక వర్గ కోఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తొమ్మిదేళ్లలో పీఎం మోదీ పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను కార్యకర్తలు ప్రతి ఇంటికి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. సమావేశంలో మండల ఇన్‌చార్జి తమిళనాడుకు చెందిన సుభాష్, బీజేపీ నాయకులు రవీందర్, నరేష్, శ్రీనివాసాచారి, నరేంద్రచారి, రవి పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందజేస్తున్న వెంకటేశ్

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజు, శ్రీనివాస్, నిశాంత్, నరేష్ పలువురు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలి.. వానలు కురిపించాలి



జమ్మికుంట: వరుణుడు కరుణించి వానలు కురిపించాలని పట్టణంలో బజార్ హమాలీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కప్పతల్లి ఆడారు. ఫెర్టిలైజర్ రోడ్డు, గాంధీ చౌరస్తాలో, పాత కురగాయల మార్కెట్ ఏరియాతోపాటు పలు ప్రాంతాల్లో పాటలు పాడుతూ తిరిగారు. మహిళలు బిందెలతో నీళ్లు పోశారు. కార్యక్రమంలో బజార్ హమాలీ సంఘం సభ్యులు మద్దిమల్ల కుమార్, బోగం సంపత్, రావుల ఓదెలు, బోగం రాజు, గుత్తికొండ హరీష్, బండ ప్రశాంత్, ఎండీ కలీల్ తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఘనంగా గురుపౌర్ణమి

చొప్పదండి: మండలంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చొప్పదండిలోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. మండలంలోని రుక్మాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవేంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో సాంప్రదాయ వంటలు చేసి సహఫంక్తి భోజనం పనిచేశారు.

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలోని శ్రీలక్ష్మిగణపతి షిర్డీ సాయిబాబా దేవాలయంలో వేద పండితులు సముద్రాల ప్రసాదాచార్యులు, కిషోరాచార్యులు ఆధ్వర్యంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి సేవా సమితి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మానకొండూర్: గురు పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సుడా చైర్మన్ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ సీతారామ చంద్రస్వామి, అభయాంజనేయస్వామి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ ఎల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.